క్లుప్తంగా

554 మందిలో ఇద్దరికే రుణమాఫీ

● అసెంబ్లీలో ప్రస్తావించిన ఎమ్మెల్యే కూనంనేని

రఘునాథపల్లి: మండలంలోని నిడిగొండ ప్రాథమిక వ్యవసాయ సహకార సొసైటీ (పీఏసీఎస్)లో రుణమాఫీ అంశం శుక్రవారం అసెంబ్లీలో చర్చకు వచ్చింది. సీపీఐ ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు శాసనసభ సమావేశాల్లో ఈ విషయాన్ని ప్రస్తావించారు. రఘునాథపల్లి మండలం నిడిగొండ సొసైటీలో 554 మంది రైతులకు క్రాప్‌లోన్ ఉండగా.. కేవలం ఇద్దరికి మాత్రమే మాఫీ అయ్యిందని, 552 మందికి కాలేదన్నారు. ఆధార్ కార్డు వివరాలు తప్పుగా నమోదు చేసిన క్రమంలో జరిగిన పొరపాటే రుణమాఫీకి అర్హులు కాకుండా ఉన్నారని, ఈ విషయాన్ని నోట్ చేసుకోవాలని మంత్రి శ్రీధర్‌బాబును కోరిన ఆయన, పొరబాటును సరి చేసి అర్హులందరికీ రుణమాఫీ చేయాలని సీపీఐ ఎమ్మెల్యే కోరారు.

బ్రాహ్మణుల మేలుకోరే ప్రభుత్వం



పాలకుర్తి టౌన్: బ్రాహ్మణుల సంక్షేమానికి రాష్ట్ర బడ్జెట్‌లో రూ.100 కోట్లు కేటాయించడంపై బ్రాహ్మణ సేవా సమితి రాష్ట్ర అధ్యక్షుడు పాచంపల్లి రమణారావు, గంగు నవీన్‌కుమార్ ప్రభుత్వానికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. శుక్రవారం మండల కేంద్రంలో విలేకరులతో వారు మాట్లాడారు. బ్రాహ్మణ సంక్షేమ పరిషత్ ద్వార పేద బ్రాహ్మణ విద్యార్థులు ఉన్నత చదువుల కోసం విదేశీ విద్యకు ప్రభుత్వం రూ.30 కోట్లు మంజూరు చేసిందన్నారు. ఈ సమావేశంలో దీపదీప నైవేద్యం రాష్ట్ర అధ్యక్షుడు దౌలతాబాద్ వాసుదేవ వర్మ, వింజమూరు సుధాకర్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు గంగు శ్రవణ్‌కుమార్, లక్ష్మీనర్సింహశర్మ, అమర్‌నాథ్ శర్మ, పాల్గొన్నారు.

చికిత్స పొందుతున్న యువకుడి మృతి

నర్మెట: పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన యువకుడు చికిత్స పొందుతూ మృతి చెందిన సంఘటన హన్మంతాపూర్ దొడ్లగడ్డ తండాలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాలు.. హన్మంతాపురం దొడ్లగడ్డ తండాకు చెందిన కొర్ర ప్రదీప్ (25) కార్లు, ద్విచక్ర వాహనాల క్రయ, విక్రయాల వ్యాపారం చేస్తూ జీవనం సాగిస్తూ జల్సాలకు అలవాటు పడటంతో అప్పుల య్యాయి. కాగా, బుధవారం ఉదయం తన వ్యవసాయ బావివద్ద పురుగుల మందుతాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడగా కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం హనుమకొండకు తరలించారు. చికిత్స పొందుతూ శుక్రవారం మృతిచెందాడు. మృతుడి తండ్రి మనోహర్ ఇచ్చిన ఫిర్యాదుతో కేసునమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు ఎస్సై నైనాల నగేశ్ తెలిపారు.


తాటి చెట్టు పైనుంచి పడి గీత కార్మికుడి..

చిల్పూరు: మండలంలోని శ్రీపతిపల్లి గ్రామానికి చెందిన కొయ్యడ నరేశ్‌గౌడ్ (35) శుక్రవారం ప్రమాదవశాత్తు తాటిచెట్టు పైనుంచి పడి మృతి చెందాడు. మృతుడి తండ్రి వెంకటనర్సయ్య అందించిన వివరాల ప్రకారం.. రోజు మాదిరిగా ఉదయం కల్లుగీసేందుకు తాటిచెట్టు ఎక్కిన నరేశ్ మోకుజారి కిందపడి అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడి భార్య భవాని ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసునమోదు చేసుకున్నట్లు ఎస్సై నవీన్‌కుమార్ తెలిపారు.

రూ.10లక్షల ఎక్స్‌గ్రేషియా ఇవ్వాలి

ప్రమాద వశాత్తు తాటిచెట్టు పైనుంచి పడి మృతి చెందిన కొయ్యడ నరేశ్‌గౌడ్ కుటుంబానికి ప్రభుత్వం నుంచి రూ.10 లక్షల ఎక్స్‌గ్రేషియా ఇచ్చి ఆ కుటుంబాన్ని ఆదుకోవాలని తెలంగాణ గౌడ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షురాలు బత్తిని కీర్తిలత గౌడ్ కోరారు. శుక్రవారం బాధిత కుటుంబ సభ్యులను ఆయన పరామర్శించి రూ.5వేల సాయం అందజేశారు.

మిత్రుల చేయూత



జఫర్‌గఢ్: మండలంలోని లక్ష్మీనాయక్‌తండాకు చెందిన భూక్య చిట్టిబాబు ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. కాగా అతడితో కలిసి 2010–11 పదో తరగతి చదువుకున్న మిత్రులు బాధిత కుటుంబాన్ని పరామర్శించి రూ.27వేల సాయం అందజేశారు. మండల రాకేష్, సముద్రాల సందీప్, కలకోట దినేష్, బుంగాని రాజేంద్రప్రసాద్ ఉన్నారు.

బాధిత కుటుంబానికి సాయం



లింగాలఘణపురం: మండల కేంద్రానికి చెందిన మాజీ ఉపసర్పంచ్ ప్యాట ముత్తయ్య అనారోగ్యంతో శుక్రవారం మృతి చెందాడు. కాగా, లింగాల దీకప్‌రెడ్డి, సింధూ బాధిత కుటుంబాన్ని పరామర్శించి రూ.20వేల సాయం అందజేశారు. కుటుంబానికి అండగా ఉంటామని చెప్పారు.

ఎట్టకేలకు అంగన్‌వాడీ కేంద్రానికి దారి

● కలెక్టర్ షేక్ రిజ్వాన్ బాషా సీరియస్‌తో కదిలిన అధికార యంత్రాంగం

లింగాలఘణపురం: మండల కేంద్రంలోని అంగన్‌వాడీ కేంద్రం–1కు ఎట్టకేలకు అధికారులు దారిని ఏర్పాటు చేశారు. రెండు దిక్కుల దారి ఉన్న అంగన్‌వాడీ కేంద్రానికి రెండేళ్ల క్రితం దారి లేదని మూసి వేసి మరో కేంద్రంలో అంగన్‌వాడీ నిర్వహిస్తున్నారు. ఈ నేపథ్యంలో అనేకసార్లు గ్రామస్తులు మండల స్థాయి అధికారులకు ఫిర్యాదు చేసిన ఫలితంలేదు. నాలుగు నెలల క్రితం గ్రీవెన్స్‌లో కూడా గ్రామస్తులు ఫిర్యాదు చేశారు. అయినప్పటికీ పెద్దగా అధికారులు స్పందించలేదు. ఈ నేపథ్యంలో శుక్రవారం కలెక్టర్ మండల పరిషత్ కార్యాలయంలో వేసవి ప్లానింగ్‌పై జరుగుతున్న సమావేశానికి హాజరయ్యారు. అక్కడే ఉన్న అంగన్‌వాడీ సూపర్‌వైజర్ హంసమ్మ సమస్యను కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లడంతో అధికారులపై సీరియస్ కావడం, దారిని అడ్డుకునే వారిపై అవసరమైతే క్రిమినల్ కేసు నమోదు చేసి అంగన్‌వాడీకి దారిని ఏర్పాటు చేయాలని ఆదేశించారు. దీంతో స్పందించిన తహసీల్దార్ రవీందర్, ఎంపీడీఓ జలేందర్‌రెడ్డి, సీఐ శ్రీనివాసురెడ్డి, ఎస్సై శ్రావణ్‌కుమార్ అంగన్‌వాడీ కేంద్రం వద్దకు వెళ్లి అక్కడి పరిస్థితులను స్థానికులను అడిగి తెలుసుకుని దారిని అడ్డుకుంటున్న మహిళతో మాట్లాడారు. కొద్దిసేపు వాగ్వాదానికి దిగిన సదరు మహిళను ఒప్పించి డోజర్‌తో వెంటనే దారిని ఏర్పాటు చేశారు. సోమవారం నుంచి అంగన్‌వాడీ కేంద్రం నిర్వహించాలని సూపర్‌వైజర్ హంసమ్మను ఆదేశించారు. ఎంపీఓ రఘురామకృష్ణ, ఆర్‌ఐ కిశోర్, పంచాయితీ కార్యదర్శి ప్రవీణ్‌కుమార్, గ్రామస్తులు పాల్గొన్నారు.



అంగన్‌వాడీ కేంద్రం



దారిని అడ్డుకుంటున్న మహిళతో మాట్లాడుతున్న అధికారులు



డోజర్‌తో దారి ఏర్పాటు చేస్తున్న అధికారులు

మార్కెట్ అభివృద్ధికి సహకరించాలి

స్టేషన్‌ఘన్‌పూర్: ఘన్‌పూర్ వ్యవసాయ మార్కెట్ అభివృద్ధికి పాలక మండలి, ట్రేడర్లు, వ్యాపారులు, రైతులు అందరూ సహకరించాలని మార్కెట్ చైర్‌పర్సన్ జూలుకుంట్ల లావణ్యశిరీష్‌రెడ్డి అన్నారు. స్థానిక వ్యవసాయ మార్కెట్‌లో కార్యదర్శి భాస్కర్ అధ్యక్షతన మార్కెట్ పాలక మండలి సర్వసభ్య సమావేశాన్ని శుక్రవారం నిర్వహించారు. ఈసందర్భంగా చైర్‌పర్సన్ మాట్లాడుతూ మార్కెట్‌లో చేపట్టనున్న వివిధ అభివృద్ధి పనులపై చర్చించి ప్రణాళికలు సిద్ధం చేసినట్లు తెలిపారు. పీఏసీఎస్ చైర్మన్ నరేందర్‌రెడ్డి, మార్కెట్ వైస్ చైర్మన్ ఐలయ్య, మార్కెట్ డైరెక్టర్లు పాల్గొన్నారు.

మార్కెట్‌ను ఆదర్శంగా తీర్చిదిద్దడమే లక్ష్యం

కొడకండ్ల: కొడకండ్ల వ్యవసాయ మార్కెట్‌ను అన్ని రంగాల్లో అభివృద్ధి పర్చి ఆదర్శంగా తీర్చిదిద్దడమే తమ లక్ష్యమని మార్కెట్ చైర్మన్ నల్ల అండాలు అన్నారు. శుక్రవారం మండలకేంద్రంలోని మార్కెట్ కార్యాలయంలో నిర్వహించిన పాలకవర్గ సమావేశంలో చైర్మన్ మాట్లాడుతూ సమావేశంలో మార్కెట్ అభివృద్ధిపై సభ్యులతో చర్చించి పలు ప్రతిపాదనలు ఏకగ్రీవంగా ఆమోదించినట్లు తెలిపారు. గతంలో దళారులు రోడ్లపై బహిరంగంగా ధాన్యం కొనుగోలు చేసినా అధికారులు చూసి చూడనట్లు వ్యవహరించారని వైస్ చైర్మన్ ఈరంటి సాయికృష్ణ చైర్మన్ దృష్టికి తీసుకురాగా వచ్చే సీజన్ నుంచి అలాంటి అవకాశాలకు తావు లేకుండా చర్యలు తీసుకొంటామన్నారు. డీఎంఓ, ఇన్‌చార్జ్ కార్యదర్శి నరేంద్ర డైరెక్టర్‌లు దేశగాని నాగరాజు, బత్తుల వెంకన్న, నారెడ్డి వెంకట్‌రెడ్డి, వనం మోహన్, ముత్యాల పూర్ణచందర్, ఈదయ్య పాల్గొన్నారు.

ఎంపీడీఓ కార్యాలయం తనిఖీ



కొడకండ్ల: మండల పరిషత్ కార్యాలయాన్ని శుక్రవారం జిల్లా పరిషత్ సీఈఓ మాధూరికిరణ్‌చంద్రషా ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా రిజిష్టర్లను ఆమె తనిఖీ చేసి విధి నిర్వహణలో అలసత్వం వహించొద్దని సిబ్బందికి సూచించారు. వేసవి కాలంలో గ్రామాల్లో తాగునీటి సమస్యలు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని ఆమె అన్నారు. బీసీ వేల్ఫేర్ ఆఫీసర్ రవిందర్, జడ్పీ సూపరింటిండెంట్ ఉమామహేశ్వర్, ఎంపీడీఓ నాగేశాద్రిసూరి తదితరులు ఉన్నారు.

ఎకరాకు రూ.25వేల పరిహారం చెల్లించాలి



జీబీ తండాలో ఎండిన వరిపంటను పరిశీలిస్తున్న రాజయ్య

● మాజీ ఎమ్మెల్యే రాజయ్య

స్టేషన్‌ఘన్‌పూర్: ప్రస్తుత యాసంగిలో సాగునీరు అందక ఎండిపోయిన వరిపంటలకు ఎకరాకు రూ.25వేలు చొప్పున రైతులకు నష్టపరిహారం చెల్లించాలని మాజీ ఎమ్మెల్యే డాక్టర్ తాటికొండ రాజయ్య ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మండలంలోని తాటికొండ గ్రామంలో, తాటికొండ శివారులోని జీబీ తండాలో ఎండిన వరిపంటలను రాజయ్య బీఆర్‌ఎస్ నాయకులతో కలిసి శుక్రవారం పరిశీలించారు. తాటికొండలో మేకల వెంకటయ్య, రాజయ్య, మారపాక భిక్షపతి, జీబీ తండాలో బానోతు రవికి చెందిన ఎండిపోయిన వరిపంటలను పరిశీలించారు. ఈ సందర్భంగా రైతులతో మాట్లాడారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ నియోజకవర్గంలోని పలు గ్రామాల్లో రైతులకు చెందిన పంటపొలాలు, బోర్లు, బావులు సాగునీరు అందక ఎండిపోతున్నాయన్నారు. ఎమ్మెల్యే, ప్రభుత్వం స్పందించి రైతులకు సరిపడా సాగునీరు అందించాలని, పంటలు ఎండిపోయిన రైతులకు నష్టపరిహారం అందించాలని డిమాండ్ చేశారు. మాజీ జెడ్పీటీసీ మారపాక రవి, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు మాచర్ల గణేష్‌గౌడ్, నాయకులు తాటికొండ సురేష్, ఎ. కుమార్, అక్కినపెల్లి బాలరాజు తదితరులు పాల్గొన్నారు.

యాదవుల సంక్షేమానికి ప్రాధాన్యం ఇవ్వాలి



రఘునాథపల్లి/పాలకుర్తి: యాదవుల సంక్షేమానికి ప్రభుత్వం తగిన ప్రాధాన్యం ఇవ్వాలని యాదవ హక్కుల పోరాట సమితి జిల్లా అధ్యక్షుడు తాటికొండ వెంకటేష్‌యాదవ్ కోరారు. ఈ నెల 28న జిల్లా కేంద్రంలోని ఎస్‌ఎంఆర్ గార్డెన్‌లో నిర్వహించనున్న యాదవ శంఖారావం సదస్సు కోసం మండలంలోని కోమళ్లలో జరిగిన సన్నాహక సమావేశంలో ఆయన మాట్లాడారు. యాదవ శంఖారావానికి యాదవులు అధిక సంఖ్యలో తరలిరావాలని ఆయన పిలుపునిచ్చారు. సంఘం మండల ఇన్‌చార్జ్ చెవుల రాజుయాదవ్ తదితరులు పాల్గొన్నారు. అలాగే పాలకుర్తి మండల కేంద్రంలో మండల అధ్యక్షుడు బైకాని శ్రీనివాస్ యాదవ్ అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో వెంకటేశ్ యాదవ్ పాల్గొని మాట్లాడారు. ఐలేష్, రాజు, రాములు, కొండయ్య పాల్గొన్నారు.

నాణ్యమైన విద్యుత్ సరఫరాకు చర్యలు

లింగాలఘణపురం: మండలంలోని కుందారం, వడిచర్ల సబ్‌స్టేషన్ల పరిధిలోని గ్రామాల రైతులకు వేసవిలో నాణ్యమైన విద్యుత్ సరఫరా చేసేందుకు రెండు నూతన బ్రేకర్లను ఏర్పాటు చేసినట్లు డీఈ లక్ష్మీనారాయణరెడ్డి తెలిపారు. శుక్రవారం కుందారం గ్రామానికి, వ్యవసాయానికి ప్రత్యేక ఫీడర్లను ఏర్పాటు చేశామని, వడిచర్ల సబ్‌స్టేషన్‌లో కొత్తపల్లి, వడిచర్ల ఫీడర్ల లోడ్స్‌ను బై ఫర్‌కేట్ చేసి ఫీడర్ ట్రిప్ కాకుండా చేశామని, దీంతో రైతులకు నాణ్యమైన విద్యుత్ అందుతుందని చెప్పారు. ఆయనతో పాటు టెక్నికల్ డీఈ గణేష్, ఏడీ అనిల్‌కుమార్ తదితరులు ఉన్నారు.

‘వేసవిలో తాగునీటి సమస్య లేకుండా చూడాలి’



పాలకుర్తి టౌన్: వేసవిలో గ్రామాల్లో తాగునీటి సమస్య లేకుండా చూడాలని మండల ప్రత్యేక అధికారి, డీఆర్డీఓ పీడీ వసంత అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాయలయంలో పంచాయతీ కార్యదర్శులు, ఫీల్డ్ అసిస్టెంట్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అమె మాట్లాడుతూ ఉపాధిలో ఎక్కువ మందికి కూలీలకు పని కల్పించాలన్నారు. ఉపాధి పనికి వచ్చే కూలీకు తాగునీరు, ఓఆర్‌ఎస్ ప్యాకెట్లను ఇవ్వాలని ఫీల్డ్ అసిస్టెంట్లకు సూచించారు. తహసీల్దార్ శ్రీనివాస్, ఎంపీడీఓ ఆవుల రాములు, ఎంపీవో రవీందర్, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈలు ప్రశాంతి.నవీన్‌రెడ్డి, ఏపీవో మంజుల పాల్గొన్నారు.

పూలే, అంబేడ్కర్ స్ఫూర్తితో పోరాటాలు

● కేవీపీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి టి.స్కైలాబ్ బాబు

జనగామ రూరల్: పూలే, అంబేడ్కర్ స్ఫూర్తితో కుల వివక్షపై చేపట్టనున్న పోరాటాల్లో ప్రతీ ఒక్కరూ భాగస్వాములు కావాలని కేవీపీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి టి.స్కైలాబ్ బాబు పిలుపునిచ్చారు. శుక్రవారం నాగమయ్యకుంట ప్రజాసంఘాల జిల్లా కార్యాలయంలో కేవీపీఎస్ జిల్లా అధ్యక్షుడు తూటి దేవదానం అధ్యక్షతన కేవీపీఎస్ జిల్లాస్థాయి సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా స్కైలాబ్ బాబు మాట్లాడుతూ.. ఆధునిక యుగంలో కూడా గ్రామ సీమల్లో కులవివక్ష, అంటరానితనం ప్రత్యక్షంగా, పట్టణాల్లో పరోక్షంగా కొనసాగుతున్నాయన్నారు. నేటికీ పట్టణాల్లో దళితులకు ఇల్లు అద్దెకు ఇవ్వడం లేదన్నారు. దళితులపై అసమానతలు పారద్రోలేందుకు ఉన్న చట్టాలు, జీఓలు, రాజ్యాంగ బద్ధమైన హక్కులను పాలకవర్గాలు అమలు చేయడం లేదన్నారు. ఏప్రిల్ నెల మొత్తాన్ని మహనీయుల మాసంగా కేవీపీఎస్ ప్రకటించి పూలే, అంబేడ్కర్ జన జాతరలు రాష్ట్రవ్యాప్తంగా నిర్వహించనున్నట్లు తెలిపారు. కేవీపీఎస్ జిల్లా కార్యదర్శి బొట్ల శేఖర్, జిల్లా ఉపాధ్యక్షుడు పల్లెర్ల లలిత, మబ్బు ఉప్పలయ్య, గడ్డం యాదగిరి, శైలజ అరూరి కృష్ణ, బొట్ల శ్రావణ్, జి.మనోహర్, మచ్చ సంధ్య తదితరులు పాల్గొన్నారు.



జిల్లా స్థాయి సమావేశంలో మట్లాడుతున్న స్కైలాబ్ బాబు

యువతతోనే సమాజంలో మార్పు

కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జ్ ఝాన్సీరెడ్డి

కొడకండ్ల/దేవరుప్పుల: యువత చేతుల్లోనే సమాజ భవిష్యత్ ముడిపడి ఉన్నందున యువత బలోపేతమై సమాజంలో మార్పు తీసుకురావాలని నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌చార్జ్ హనుమాండ్ల ఝాన్సీరెడ్డి కోరారు. శుక్రవారం కొడకండ్ల, దేవరుప్పుల మండలకేంద్రాల్లోని పార్టీ కార్యాలయాల్లో నిర్వహించిన యూత్ కాంగ్రెస్ సమీక్ష సమావేశాల్లో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. నిత్యం ప్రజలతో మమేకమవుతూ ప్రజా సమస్యల పరిష్కారంలో కీలకభూమికను యువజన నాయకులు పోషించాలని, పార్టీ శ్రేయస్సుతో పాటు ప్రజా సంక్షేమంలో తమదైన పాత్రను పోషిస్తూ నాయకత్వ లక్షణాలు పెంపొందించుకోవాలని అన్నారు. కాంగ్రెస్ మండలాల అధ్యక్షులు సురేష్‌నాయక్, నల్ల శ్రీరాములు, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు సత్యనారాయణ, నల్లా శ్రీరామ్, యూత్ కాంగ్రెస్ నియోజకవర్గ, మండలాల అధ్యక్షులు రాజేష్‌నాయక్, యాకేష్‌యాదవ్, రాజేష్ నాయక్, వెంకన్న పాల్గొన్నారు.



కొడకండ్ల: మాట్లాడుతున్న ఝాన్సీరెడ్డి

జయప్రదం చేయాలి

స్టేషన్‌ఘన్‌పూర్: నకిలీ సర్టిఫికెట్ల సూత్రధారి మీస రాజమల్లయ్యను తక్షణమే సస్పెండ్ చేయాలని డిమాండ్ చేస్తూ ఈనెల 24న వరంగల్ ఆర్‌జేడీ కార్యాలయం ఎదుట టీటీయూ(తెలంగాణ టీచర్స్ యూనియన్) ఆధ్వర్యంలో నిర్వహించనున్న ధర్నాకు ఉపాధ్యాయులు అధిక సంఖ్యలో హాజరై జయప్రదం చేయాలని టీటీయూ స్టేట్ అసోసియేట్ ప్రెసిడెంట్ ఉబ్బని భిక్షపతి, జిల్లా అధ్యక్షుడు భారత రవీందర్ డిమాండ్ చేశారు. ఘన్‌పూర్ డివిజన్‌కేంద్రంలో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. టి.సమ్మయ్య, విజయభాస్కర్‌రెడ్డి, యాకయ్య ఉన్నారు.

తాగునీరు.. డ్రెయినేజీ పాలు



మూడు నల్లాల నుంచి వృథాగా పోతున్న నీరు

జలాశయాలు అడుగంటి.. భూగర్భ జలాలు ప్రమాద స్థాయికి చేరుకుని.. సాగు, తాగునీటి కరువు ముంచుకొస్తుంటే.. జిల్లా కేంద్రంలో అదేమీ పట్టనట్టు వ్యవహరిస్తున్నారు పురపాలిక అధికారులు, ప్రజలు. పట్టణంలోని సిద్దిపేట రోడ్డులో మిషన్ భగీరథ ట్యాపులు మూడింటిని ఆన్ చేసి వదిలేశారు. దీంతో వేల లీటర్ల నీరు వృథాగా డ్రెయినేజీలో కలుస్తోంది. నీటి వృథాను అరికట్టే విషయంలో ప్రజలకు అవగాహన కలిగించే అధికారి లేకవడం.. పర్యవేక్షించాల్సిన కమిషనర్ మిన్నకుండి పోవడం విమర్శలకు తావిస్తోంది.

– జనగామ

ప్రజలు ఇబ్బంది పడకుండా చర్యలు చేపట్టాలి

● కలెక్టర్ షేక్ రిజ్వాన్ బాషా

లింగాలఘణపురం: వేసవిలో ప్రజలు ఇబ్బంది పడకుండా పకడ్బందీ చర్యలు చేపట్టాలని.. ముఖ్యంగా తాగు, సాగునీటి సమస్య, వడదెబ్బకు గురికాకుండా చూడాలని, మండల స్థాయిలో టాస్క్‌ఫోర్స్ కమిటీలను ఏర్పాటు చేసుకోవాలని కలెక్టర్ షేక్ రిజ్వాన్ బాషా ఆదేశించారు. శుక్రవారం మండల పరిషత్ కార్యాలయంలో వివిధ శాఖలతో వేసవిలో ఏర్పడే ఇబ్బందులపై మండల స్థాయిలో టాస్క్‌ఫోర్స్ కమిటీలతో సమావేశాలు జరుగుతున్న నేపథ్యంలో కలెక్టర్ హాజరై తగిన సూచనలు చేశారు. సమావేశంలో ఎంపీడీఓ జలేందర్‌రెడ్డి, తహసీల్దార్ రవీందర్, ఏఓ వెంకటేశ్వర్లు, నీటిపారుదలశాఖ, ఆర్‌డబ్ల్యూఎస్ తదితర శాఖల అధికారులు పాల్గొన్నారు.

పదో తరగతి పరీక్ష కేంద్రాల సందర్శన

మండల కేంద్రంలోని మోడల్ స్కూల్, నెల్లుట్లలో పదో తరగతి పరీక్ష కేంద్రాలను కలెక్టర్ సందర్శించారు. ఈ సందర్భంగా మోడల్ స్కూల్, నెల్లుట్లలో చీఫ్ సూపరింటెండెంట్ శ్రీహరి, చలపతిరెడ్డిలను అడిగి తెలుసుకున్నారు. కేంద్రాల్లో గదులను పరిశీలించి తాగునీరు, విద్యుత్ సౌకర్యం తదితర మౌలిక వసతులను పరిశీలించి పరీక్షలు సజావుగా జరిగే విధంగా చూడాలని చెప్పారు. కలెక్టర్‌తో పాటు డీఈఓ రమేశ్, తహసీల్దార్ రవీందర్ ఉన్నారు.



మాట్లాడుతున్న కలెక్టర్ షేక్ రిజ్వాన్‌భాషా

‘పది’ పరీక్షలు ప్రారంభం

సాక్షి నెట్‌వర్క్: జిల్లా వ్యాప్తంగా పదోతరగతి వార్షిక పరీక్షలు పలు పాఠశాలల్లో శుక్రవారం ప్రశాంతంగా ప్రారంభమయ్యాయి. స్క్వాడ్ పరీక్ష కేంద్రాలను సందర్శించి తనిఖీ చేపట్టింది. ఉన్నతాధికారుల పర్యవేక్షణలో పరీక్షల నిర్వహణ సిబ్బంది మౌలిక వసతుల కల్పనకు చర్యలు చేపట్టారు. పరీక్ష కేంద్రాల వద్ద పోలీసులు బందోబస్తును నిర్వహించారు.



నర్మెట ఉన్నత పాఠశాల ఎదుట విద్యార్థులు



దేవరుప్పుల: విద్యార్థులను తనిఖీ చేస్తున్న ఇన్విజిలేటర్లు



స్టేషన్‌ఘన్‌పూర్: విద్యార్థులతో సోషల్ వెల్ఫేర్ స్కూల్ పీడీ శ్రీనివాస్

వడదెబ్బ తగలకుండా జాగ్రత్తలు పాటించాలి

కొడకండ్ల: వేసవి కాలంలో ఎండల తీవ్రత ఎక్కువగా ఉండే అవకాశం ఉన్నందున ప్రజలంతా అప్రమత్తంగా ఉంటూ వడదెబ్బ తగలకుండా జాగ్రత్తలు పాటించాలని తహసీల్దార్ కోల చంద్రమోహన్, ఎంపీడీఓ నాగేశాద్రిసూరి కోరారు. శుక్రవారం మండల పరిషత్ కార్యాలయంలో మండల టాస్క్‌ఫోర్స్ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన శిక్షణ కార్యక్రమంలో వారు మాట్లాడుతూ సరైన పోషకాహారాన్ని తీసుకుంటూ ఎండలో బయటికి వెళ్లకుండా ఇంట్లోనే ఉంటూ ప్రజలు జాగ్రత్తలు పాటించాలన్నారు. ఎస్సై చింత రాజు, ఎఓ విజయ్‌రెడ్డి, డాక్టర్ హరికృష్ణ, ఏపీఓ కుమారస్వామి, ఏపీఎం సత్యనారాయణ పాల్గొన్నారు.



పోస్టర్లను ఆవిష్కరిస్తున్న అధికారులు

సంక్షిప్త సమాచారం

గ్రామాల అభివృద్ధి కాంగ్రెస్‌తోనే

జనగామ రూరల్: గ్రామాల అభివృద్ధి కాంగ్రెస్‌తోనే సాధ్యమని మార్కెట్ కమిటీ చైర్మన్ బనుక శివరాజ్ అన్నారు. శుక్రవారం మండలంలోని పసరమడ్ల గ్రామంలో చేపట్టిన సీసీ రోడ్డు నిర్మాణ పనులను ఆయన ప్రారంభించి మాట్లాడారు. మండల అధ్యక్షుడు లింగాల నర్సిరెడ్డి, శివరాత్రి కుమార్, సుదగని కృష్ణ ప్రకాష్, కురెమ్మల రవి కుమార్ పాల్గొన్నారు.

‘రెస్టారెంట్‌పై చర్య తీసుకోవాలి’

జనగామ రూరల్: వినియోగదారులను ఇబ్బందులకు గురిచేసిన పట్టణంలోని క్యూటీక్యూ రెస్టారెంట్‌పై అధికారుల చర్యలు తీసుకోవాలని ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా అధ్యక్షుడు దడిగె సందీప్ కోరారు. ఈ మేరకు శుక్రవారం మున్సిపల్ కార్యాలయం వద్ద సీపీఎం ఆధ్వర్యంలో ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా సందీప్ మాట్లాడుతూ గురువారం క్యూటీక్యూ రెస్టారెంట్‌లో బిర్యానీలో బొద్దింక వస్తే రాత్రి సీజ్ చేసిన అధికారులు శుక్రవారం తిరిగి ప్రారంభించడం ఏంటని ప్రశ్నించారు. పల్లెర్ల లలిత, కేవీపీఎస్ పట్టణ కార్యదర్శి బొట్ల శ్రావణ్, టీజీఎస్ జిల్లా కార్యదర్శి అజ్మీర సురేష్, డీవైఎఫ్‌ఐ నాయకులు పాల్గొన్నారు.

కాల్వల పనులు పూర్తి చేయడంలో ప్రభుత్వం విఫలం

జఫర్‌గఢ్: దేవాదులకు సంబంధించిన సాగునీటి కాల్వల పనులు పూర్తి చేయడంలో ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు రాపర్తి సోమయ్య అన్నారు. పార్టీ మండల కమిటీ ఆధ్వర్యంలో మండలంలోని తిమ్మాపూర్, హిమ్మత్‌నగర్, తమ్మడపల్లి (జి) గ్రామాల్లో పేరుకుపోయిన సమస్యలు, ఎండిన పంటలపై క్షేత్ర స్థాయి సర్వే కార్యక్రమాన్ని శుక్రవారం చేపట్టారు. పార్టీ మండల కార్యదర్శి గుండెబోయిన రాజు, ఎండీ షబానా, కాట సుధాకర్, యాతం సమ్మయ్య, నీరటి కొమురయ్య, తాటికాయల రేణుక తదితరులు పాల్గొన్నారు.

శ్మశాన వాటికలో విద్యుత్ కరువు

చిల్పూరు: శ్రీపతిపల్లి గ్రామంలోని శ్మశాన వాటికలో విద్యుత్ సౌకర్యం కరువైంది. కాగా, శుక్రవారం గ్రామానికి చెందిన గీతకార్మికుడు కొయ్యడ నరేశ్ అంతిమసంస్కారం నిర్వహించేందుకు కోసం శ్మశాన వాటికకు రాత్రి వెళ్లగా అక్కడ విద్యుత్ లేకపోవడంతో సెల్‌ఫోన్ వెలుగులో దహనసంస్కారాలు నిర్వహించారు. జీపీ అధికారులు స్పందించి విద్యుత్ సౌకర్యం కల్పించాలని ప్రజలు కోరారు.

రుణాలపై అవగాహన తప్పనిసరి

జఫర్‌గఢ్: బ్యాంకు ద్వారా పొందే పంట రుణాలపై రైతులు అవగాహన పెంచుకోవాల్సిన అవసరం ఉందని తెలంగాణ గ్రామీణ బ్యాంక్ జనగామ హబ్ మేనేజర్ జ్ఞానప్రశాంత్ అన్నారు. సాగరం గ్రామంలో పంట రుణాలపై అవగాహన కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. బ్యాంకు ద్వారా పొందిన రుణాలను తిరిగి సకాలంలో చెల్లించాలన్నారు.

పెండింగ్ పనులు పూర్తి చేయాలి

జఫర్‌గఢ్: గ్రామాల్లో అభివృద్ధికి సంబంధించిన పెండింగ్ పనులను త్వరగా పూర్తి చేయాలని మండల ప్రత్యేక అధికారి వై. రాధాకిషన్ అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీఓ సుమన్ అధ్యక్షతన అభివృద్ధి పనులపై సమీక్ష సమావేశాన్ని శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పెండింగ్ వెంటనే పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.

కమిటీ ఎన్నిక



రఘునాథపల్లి: గిద్దబండతండాలో శుక్రవారం కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు సమావేశమై నూతన మహిళా కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మాజీ ఎంపీటీసీ బానోత్ భిక్షపతినాయక్ సమక్షంలో జరిగిన ఎన్నికలో అధ్యక్షురాలిగా ధీరావత్ వినోద, ఉపాధ్యక్షురాలు భూక్య దేవి, ప్రధాన కార్యదర్శి రూపావత్ లత, కార్యదర్శి బానోత్ రేణుక, కోశాధికారి లకావత్ లలిత, సభ్యులుగా బానోత్ చంద్రకళ, బానోతు అరుణ, లలిత, సుజాత, లలిత, వెన్నెలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా మాజీ ఎంపీటీసీ మాట్లాడుతూ ఎమ్మెల్యే కడియం శ్రీహరి ఆదేశాల మేరకు గ్రామంలో మహిళా కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నామని, పార్టీని మరింత బలోపేతం చేస్తామన్నారు. నూతన కమిటీని పార్టీ నాయకులు శాలువాలతో అభినందించారు.

జమిలి ఎన్నికలే మేలు

పాలకుర్తి టౌన్: దేశంలో ప్రజాస్వామ్య మనుగడకు జమిలి ఎన్నికలే మేలని పార్లమెంట్ కో–కన్వీనర్ కొంతం శ్రీనివాస్ అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలో ఆ పార్టీ ముఖ్య కార్యకర్తల సమావేశంలో శ్రీనివాస్ మాట్లాడారు. దుబ్బా రాజశేఖర్, నిరంజన్‌రెడ్డి, దొంగరి మహేందర్ పాల్గొన్నారు.

కేజీబీవీలో ఇన్సినరేటర్ ఏర్పాటు

లింగాలఘణపురం: మండలంలోని కస్తూర్బా గాంధీ విద్యాలయంలో కలెక్టర్ షేక్ రిజ్వాన్ బాషా ఆదేశాల మేరకు శుక్రవారం శానిటరీ నాప్కిన్స్ దహనం చేసే ఇన్సినరేటర్ (ఎలక్ట్రిక్ మిషన్)ను ఏర్పాటు చేశారు. దీంతో విద్యార్థినిలు ఉపయోగించి పడేసే నాప్కిన్స్ అందులో వేసి కాల్చివేయడంతో పాఠశాల పరిసరాలు పరిశుభ్రంగా ఉంటాయని, అందుకు ప్రత్యేక చొరవ తీసుకున్న కలెక్టర్‌కు స్పెషల్ ఆఫీసర్ అన్నపూర్ణ, విద్యార్థులు కృతజ్ఞతలు తెలిపారు.

రేషన్ బియ్యం స్వాధీనం

బచ్చన్నపేట: అక్రమంగా తరలిస్తున్న రేషన్ బియ్యాన్ని మండల కేంద్రంలో పట్టుకున్నట్లు ఎస్సై ఎస్‌కే హమీద్ తెలిపారు. శుక్రవారం స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఆయన మాట్లాడుతూ రోజు మాదిరిగా పెట్రోలింగ్ చేస్తుండగా నిర్వహిస్తుండగా యాదాద్రిభువనగిరి జిల్లా రాజపేట మండలం పుట్టగూడెం గ్రామానికి చెందిన బదావత్ గణపతి ఎక్సెల్ మోపెడ్‌పై 2 క్వింటాళ్ల రేషన్ బియ్యంతో పట్టుబడ్డాడని తెలిపారు. పోలీస్‌స్టేషన్‌కు తరలించి కేసు నమోదు చేశామన్నారు.

ప్రత్యేక విందు ఏర్పాటు చేయాలి

బచ్చన్నపేట: రంజాన్ మాసంలో ముస్లింలకు రాష్ట్ర ప్రభుత్వం తరఫున ఇచ్చే ఇఫ్తార్ విందును మండలానికి ప్రత్యేకంగా ఏర్పాటు చేయాలని జామియా మదీన మజిద్ కమిటీ సభ్యులు కోరారు. ఈ మేరకు శుక్రవారం తహసీల్ కార్యాలయంలో తహసీల్దార్ ప్రకాశ్‌రావుకు వినతి పత్రాన్ని అందజేశారు. గౌస్, అజీమ్, మున్నా, దస్తగిరి, శంషీర్, జావీద్ ఉన్నారు.